క్లుప్తంగా

అండగా నిలిచిన 'ఉపాధి' సిబ్బంది


ఆర్థికసాయం అందజేస్తున్న సిబ్బంది

అశ్వాపురం: తోటి టెక్నికల్ అసిస్టెంట్ మృతి చెందడంతో ఆ కుటుంబానికి జిల్లాలోని మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది అండగా నిలిచారు. మండలంలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన ఖమ్మం జిల్లా మధిర మండలానికి చెందిన కొండా దామెదర్ ఇటీవల మృతి చెందగా శనివారం దశ దినకర కార్యక్రమంలో బాధిత కుటుంబానికి రూ.70 వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొడిమెల్ల వెంకటేష్, రామారావు పాల్గొన్నారు.

నేడు సేవా సమితి కార్యవర్గ సమావేశం

భద్రాచలంటౌన్: పట్టణంలోని శ్రీ వాసవి కన్యాకాపరమేశ్వరి ఆలయ సేవా సమితి కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహిస్తున్నట్టు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు చారుగుళ్ల శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారులను నియమించడం జరుగుతుందని పేర్కొన్నారు.

12 రకాల సరుకులు ఇవ్వాలి

అశ్వారావుపేటరూరల్: రేషన్ దుకాణాల్లో 12 రకాల సరుకులు ఇవ్వాలని పీవైఎల్, పీఓడబ్ల్యూ సంఘాల ఆధ్వర్యంలో శనివారం సంతకాల సేకరణ చేపట్టారు. మండల పరిధిలోని గాండ్లగూడెం, కావడిగుండ్ల గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి రేషన్ దుకాణాల సరుకులను ప్రతీ నెల ఉచితంగా పంపిణీ చేయాలని, దీనిపై ఆయా గ్రామాల ప్రజల అభిప్రాయాన్ని సంతకాల ద్వారా సేకరించారు. ఈ సందర్భంగా పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు, ఎంపీటీసీ వాసం బుచ్చిరాజు మాట్లాడుతూ.. అధిక ధరలతో పేదలకు అందుబాటులో లేని సరుకులను తక్షణమే ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా అందించాలని డిమాండ్ చేశారు.

మజ్జిగ పంపిణీ చేయాలని వినతి

మణుగూరు రూరల్ : మణుగూరు ఏరియాలోని పని చేస్తున్న అన్ని విభాగాల కార్మికులకు, వాహన డ్రైవర్లకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని కోరుతూ శనివారం ఇఫ్టూ ఆధ్వర్యంలో ఏరియా డీజీఎం (పర్సనల్) ఎస్.రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ ఏరియా అధ్యక్షులు మంగీలాల్ మాట్లాడగా కాంట్రాక్ట్ కార్మికులు సామేలు, ప్రసాద్, నాగేశ్వరరావు, తిరుపతిరావు, మహర్షి, ఖాదర్‌బాబు పాల్గొన్నారు

గెలలను సేకరించి ఫ్యాక్టరీకి తరలించాలి

అశ్వారావుపేటరూరల్: స్థానిక పామాయిల్ ఫ్యాక్టరీ వద్ద ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో రైతుల వద్ద నుంచి గెలలను సేకరించి, వాటిని దమ్ముపేట మండలం అప్పారావుపేట ఫ్యాక్టరీకు తరలించాలని ఆయిల్‌పాం రైతు సంఘం నాయకులు కొక్కరపాటి పుల్లయ్య కోరారు. ఈ మేరకు ఆయన శనివారం మాట్లాడుతూ.. ఫ్యాక్టరీకు సెలవు నేపథ్యంలో రైతులు గెలలు తరలించేందుకు వ్యయ ప్రయాసలకు గురి కావాల్సి వస్తోందని, రెండు నుంచి మూడు టన్నుల గెలలను తరలించేందుకు ఆర్థిక భారం పడుతోందన్నారు. కాగా ఈ విషయంపై రైతు సంఘం ద్వారా చైర్మన్, జనరల్ మేనేజర్ సుధాకర్ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు ఆయన తెలిపారు.

పరామర్శ

అశ్వారావుపేటరూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న పలు బాధిత కుటుంబాలను శనివారం అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వర్లు పరామర్శించారు. మండలంలోని ఆసుపాక, వినాయకపురం, వినాయకపురం కాలనీ గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి, పార్టీ నాయకులు, కార్యకర్తలను కలిశారు. కాంగ్రెస్ నాయకులు మొగళ్లపు చెన్నకేశవరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు మల్లికార్జున్, మాజీ సర్పంచ్ పొట్టా రాజులు, వీరభద్రరావు, ఖాషిపాండు, సింహాచలం, ముస్తఫా, బయ్యా సత్తిబాబు, మైలవరపు మల్లీ పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ హల్‌చల్

మణుగూరుటౌన్: మండలంలోని రాజుపేట ప్రాంతంలో శనివారం లారీ డ్రైవర్ హల్‌చల్ చేశాడు. మణుగూరులో ఇసుక లోడుతో వస్తున్న ఓ లారీ డ్రైవర్ అతిగా మద్యం సేవించి లారీని రోడ్డుపై ఇష్టం వచ్చినట్లు నడుపుతూ వెళ్లాడు. అతి వేగంగా నడుపుతూ రోడ్డుపక్కన చెట్లలోకి దూసుకుపోయాడు. గమనించిన స్థానికులు తీవ్ర ఆందోళనకు గురికాగా డ్రైవర్ దిగి పారిపోయాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో లారీ వివరాలను సేకరించారు.

ఇంటిబాట..

మిర్చి కోత పనులు ముగించుకొని వలసకూలీల తిరుగుపయనం

- మూడు నెలల తర్వాత ఇళ్లకు..
- ఆదివాసీలతో గూడేల్లో సందడి


తిరుగు పయనమైన ఆదివాసీ కూలీలు

చర్ల: పనులు లేక పస్తులు ఉండలేక వృద్ధులను, చంటి పిల్లలను ఇళ్ల వద్ద విడిచిపెట్టి బతుకుదెరువుకు సరిహద్దు ప్రాంతాల నుంచి భారీగా వలస వచ్చిన ఆదివాసీలు ఇంటిబాట పట్టారు. తెలంగాణా, ఆంధ్రాలోని పల్లెలు, పట్టణాల నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని ఆదివాసీ గూడేల వైపు పయణిస్తుండడంతో అటవీ ప్రాంతాల్లో రహదార్లు కళకళలాడుతుండగా, ఆదివాసీ గూడేల్లో సందడి నెలకొంది. సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, దంతెవాడ, సుకుమా జిల్లాల్లోని అటవీ ప్రాంతాలకు చెందిన ఆదివాసీలు వారి స్వగ్రామాల్లో పనులు లేకపోవడంతో వేలాది మంది డిసెంబర్, జనవరి నెలల్లో తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, అల్లూరిసీతారామరాజు, ఏలూరు జిల్లాల్లోని వివిధ ప్రాంతాలకు మిర్చి కోతల పనులకు తరలివచ్చారు. ఆదివాసీలు మిర్చి తోటలకు సమీపాల్లోని వాగులు, నదులు, చెరువుల ఒడ్డునే తాత్కాలిక నివాసాలను ఏర్పాటు వంటా వార్పు చేసుకుని పిల్లా పాపలతో పనులు సాగించారు. రోజుకు రూ.300 మేర కూలీకి పనులు చేసిన ఆదివాసీలు ఒక్కొక్కరు సగటున రూ.22 వేల నుంచి రూ 25 వేల మేరా సంపాదించుకొని పనులు ముగియడంతో ఇళ్లబాట పట్టారు. మిర్చి కోత పనులకు వచ్చే సందర్భంలోనే తిరుగు ప్రయాణపు ఖర్చులు కూడా సంబంధిత రైతులే భరించాలన్న కట్టడితో రైతులు ఏర్పాటు చేసిన వాహనాల్లో వివిధ ప్రాంతాల నుంచి తిరుగుముఖం పట్టారు.

వానాకాలానికి సరిపడా సరుకులు..

ఆదివాసీ గూడేల్లో నిత్యావసర సరుకులు కొనుగోలు చేసుకునేందుకు సరైన దుకాణాలు లేకపోవడంతో తిరుగు ప్రయాణంలో ఉన్న ఆదివాసీలు వర్షాకాలం మొత్తానికి సరిపడా సరుకులను కొనుగోలు ఇక్కడి నుంచే కొనుగోలు చేసుకొని వారి వెంట తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో చర్లలోని దుకాణాలన్నీ సరుకులు కొనుగోలు చేసేందుకు వచ్చిన ఆదివాసీలతో కళకళలాడుతున్నాయి. వారం రోజుల నుంచి ఆదివాసీలు పెద్ద ఎత్తున వారి గూడేలకు తిరిగి వెళ్తుండగా ఆదివారం కూడా చర్లలో జరిగిన వారపు సంతలో బియ్యం, నూకలు ఇతర నిత్యావసరాల విక్రయాలు పెద్ద ఎత్తున సాగాయి.


గూడేలకు చేరుకున్న ఆదివాసీలు


తిరుగు పయనంలో చర్ల సంతలో సరుకులు కొనుగోలు చేస్తూ..

ఆదివాసీ యువకులు మొబైల్ ఫోన్లు, రేడియోలు, వాచ్‌లు కొనుగోలు చేసేందుకు ఆసక్తిని కనబరుస్తుండడంతో ఆయా షాపుల్లో రద్దీ పెరుగుతోంది. బీజాపూర్, సుకుమా, దంతెవాడ జిల్లాల్లోని ఆదివాసీ గ్రామాలకు వెళ్లాలంటే మండలంలోని కుర్నపల్లి, తిప్పాపురం, పూసుగుప్ప రహదార్లే ప్రధాన రహదార్లు కావడంతో వారం రోజులుగా ఈ రహదార్ల గుండా ఆదివాసీలు తరలివెళ్లే వాహనాల తో సందడి సందడిగా ఉంది.

ఏటా ఇదే పోరాటం



ప్రతీ సంవత్సరం మిర్చి కోతల సీజన్‌లో పనుల కోసం వస్తాం. పొట్ట పోషణ కోసం మూడు, నాలుగు నెలల పాటు పిల్లల్ని, తల్లిదండ్రుల్ని వదలి వస్తాం. ఇక్కడ పని చేసి వచ్చిన డబ్బులతో వర్షాకాలానికి సరిపడా సరుకులన్నీ కొనుక్కొని వెళ్తాం.

– పొడియం సింగ, దోకుపాడు

కూలి డబ్బులు పొదుపుగా వాడతాం..



మా దగ్గర పనులు ఏమీ ఉండకపోవడంతో పొరుగున ఉన్న ప్రాంతాలకు కూలి పనులకు పోతాం. వచ్చే డబ్బులను మళ్లీ పనులు ప్రారంభమయ్యేంత వరకు పొదుపుగా వాడుకుంటాం. ఏటా ఇదే మా జీవన విధానం. పనులు పూర్తవ్వడంతో ఇళ్లకు చేరి పిల్లలు, పెద్దలతో సంతోషంగా గడుపుతున్నాం.

– కుంజం దేవి, తెట్టెమడుగు

దళితుల అభ్యున్నతే లక్ష్యం


వాహనాన్ని అందజేస్తున్న రేగా కాంతారావు

మణుగూరుటౌన్: దళితుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. శనివారం మణుగూరు మండలం పగిడేరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు కర్నే మురళీకి దళితబంధు పథకంలో మంజూరైన మహేంద్ర ఎక్స్‌యూవీ 300 వాహనాన్ని కొత్తగూడెం మహేంద్రా షోరూంలో ఆయన ప్రారంభించారు. దళితబంధు దళితులను ఆర్థికంగా సామాజికంగా ఎదగడానికి దోహదపడి దళితుల్లో ఐక్యతను పెంచిందన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు దళితులంతా ఐక్యంగా ఉండాలన్నారు. దళితుల అభ్యున్నతికి పాటుపడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. అందుకే తెలంగాణలోని దళితులంతా కేసీఆర్ వైపు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించిన రైతులు


రైతులతో మాట్లాడుతున్న ఆయిల్‌ఫెడ్ అధికారులు

దుమ్ముగూడెం: మండలంలోని చిన్న బండిరేవు గ్రామంలో పలువురు రైతులు సాగు చేసిన ఆయిల్ పామ్ తోటలను మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పరిధిలోని రైతులు 35మంది శనివారం క్షేత్ర పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ టి.సుధాకర్‌రెడ్డి వారికి ఆయిల్‌పామ్ సాగుతో లాభాలను వివరించారు. రైతులకు ఉద్యానశాఖ ద్వారా అంతర్ పంటల సాగుకు ఎకరానికి రూ.4,200 చొప్పున నాలుగేళ్లు అందిస్తారని తెలిపారు. మొక్కలు నాటిన మూడేళ్ల నుంచి దిగుబడి మొదలవుతుందని, ప్రకృతి విపత్తులను కూడా ఈ పంట తట్టుకుంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా డివిజనల్ మేనేజర్ ఏ.బాలకృష్ణ, ఫీల్డ్ ఆఫీసర్లు ఫణి, రాజేష్‌రెడ్డి, రైతులు సాగి శ్రీనివాస రాజు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు తెలపాలి


కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

భద్రాచలంటౌన్: కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసే విధంగా బీజేపీ కార్యకర్తలు పనిచేయాలని ఓబీసీ జిల్లా కోఆర్డినేటర్ రంగా కిరణ్ అన్నారు. భద్రాచలం పట్టణంలోని భగవాన్‌దాస్ కాలనీలో పల్లెపల్లెకు ఓబీసీ, గడపగడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా శనివారం ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆకుల నాగేశ్వరరావు, నాగేంద్ర ప్రసాద్, సతీష్ కుమార్, నాగబాబు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ పరీక్ష కేంద్రాల్లో తనిఖీలు


పరీక్ష కేంద్రం వద్ద సీఐ, ఎస్సై

అశ్వారావుపేటరూరల్: పదో తరగతి వార్షిక పరీక్ష కేంద్రాలను శనివారం స్థానిక సీఐ బాలకృష్ణ, ఎస్సై బి.రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, మండల పరిధిలోని సున్నంబట్టి వద్దగల ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టంగా బందోబస్త్ ఏర్పాటు చేసి, పరీక్ష రాసేందుకు వెళ్తున్న ప్రతీ విద్యార్థిను తనిఖీ చేశారు. ఇబ్బందులు కలిగితే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన


నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న నాయకులు

మణుగూరు రూరల్ : సింగరేణి బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణను వ్యతిరేకిస్తూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో మణుగూరు ఏరియాలోని అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లలో కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించిన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి వై.రాంగోపాల్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలోని సింగరేణికి సంబంధించిన బొగ్గు బ్లాకులన్నింటినీ బేషరతుగా సింగరేణికే అప్పగించాలని, ప్రభుత్వ రంగ సంస్థలకే వాటిని కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణలపై పోరాడుతూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంవి.రాంనర్సయ్య, నంబూరి శ్రీనివాస్, మేకల ఈశ్వర్, రవి, సుధాకర్, శ్రీనివాస్, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

అశ్వారావుపేటరూరల్: రంజాన్ మాసం సందర్భంగా శనివారం ముస్లింలకు అశ్వారావుపేటకు చెందిన లక్ష్మీ శ్రీనివాస టాకీస్ బాధ్యులు పువ్వాళ్ల శ్రీనివాసరావు కుటుంబీకుల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ విందును ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి ప్రారంభించగా పూల సాయి, చక్రధర్, ముస్లిం పెద్దలు ఎండీ.ఆసీఫ్ అలీ, ఉస్మాన్ పాల్గొన్నారు.

ఏసు బోధనల్లో ప్రేమతత్వం

బూర్గంపాడు: ఏసుక్రీస్తు బోధనల్లో ప్రేమతత్వం ఇమిడిఉందని బూర్గంపాడులోని గౌతమిపురం రబ్బుని మినిస్ట్రీస్ పాస్టర్ ఎం.రవి అన్నారు. ఈస్టర్ సందర్భంగా శనివారం అనాథ వృద్ధులు, దివ్యాంగుల ఆశ్రమంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించి, ఆశ్రమానికి బియ్యం, నిత్యావసరాలను అందజేశారు. మాజీ ఎంపీటీసీ మందా నాగరాజు పాల్గొన్నారు.

పేద ఓసీలను ఆదుకోవాలి

భద్రాచలంటౌన్: తెలుగు రాష్ట్రాలలోని పేద ఓసీలను ప్రభుత్వం ఆదుకోవాలని ఓసీ సంఘర్షన సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు సింగం సదాశివ రెడ్డి అన్నారు. పట్టణంలోని రెడ్డిసత్రంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓసీ సంఘర్షణ సమితి పదో వార్షికోత్సవ సభను ఈ నెల 9న పట్టణంలోని రెడ్డి సత్రంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో గాదె మాధవరెడ్డి, హెచ్ఎన్ మంజునాథరెడ్డి, సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

తిరునాళ్లకు ఆహ్వానం

దమ్మపేట: ఈనెల 12 నుంచి 16 వరకు మండల కేంద్రంలో నిర్వహించే శ్రీ ముత్యాలమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవానికి విచ్చేయాలని స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులను ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. శనివారం ఆలయ కమిటీ సభ్యులు స్థానిక ఎమ్మెల్యేను, తాటిసుబ్బన్నగూడెం గ్రామంలో, తుమ్మలను ఆయన నివాసం గండుగులపల్లి గ్రామంలో ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిన్నశెట్టి యుగంధర్, యార్లగడ్డ బాబు, సత్యనారాయణ, మల్లేశ్వరరావు, చిట్టిబాబు, అప్పారావు, రమేష్, గోపి, భాస్కర్ పాల్గొన్నారు.

బార్ జనరల్ సెక్రటరీకి సన్మానం


నవీన్‌ను సన్మానిస్తున్న సభ్యులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం బార్ అసోసియేషన్ ఎన్నికలో జనరల్ సెక్రెటరీగా ఎన్నికైన కొలిచలం నవీన్ ప్రజాపతిని భద్రాచలం నియోజకవర్గ కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. చర్ల రోడ్లోని కిరణ్ ఫ్లెక్స్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో కుమ్మరి సంఘం జిల్లా ఇన్‌చార్జ్ రామకృష్ణ, అధ్యక్షుడు ఇందారపు లక్ష్మణ్, రెల్లి తాతారావు, సత్యనారాయణ, బీఎస్ఎన్ఎల్ పాపారావు, నిమ్మనగొట్టి రవి కుమార్, విజ్జిగిరి రవితేజ, రాధాకృష్ణ, భాస్కర్, అంజన్ రావు, మోహన్‌రావు, గంగాధర సతీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు

వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో రిలే దీక్ష

దమ్మపేట: వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిలుపుమేరకు 'టీ సేవ్' కార్యక్రమంలో భాగంగా ఒక రోజు రిలే నిరాహార దీక్షను నిర్వహించారు. శనివారం దమ్మపేట గ్రామంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు సోయం వీరభద్రం ఆధ్వర్యంలో టీ సేవ్ కార్యక్రమంలో భాగంగా నాయకులు, కార్యకర్తలు రీలే దీక్షలో పాల్గొన్నారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం దీక్షను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొనకళ్ల శ్రీనివాసరావు, కందుకూరి రాంబాబు, గంట వెంకటేశ్వరరావు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.


రిలే దీక్షలో పాల్గొన్న నాయకులు

బాలాజీ వేంకటేశ్వర స్వామి కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో శ్రీస్వామి వారికి ఉదయం పంచామృత అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామి వారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అని ఏర్పాట్లు చేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

దుమ్ముగూడెం: మండలంలోని నడికుడి పంచాయతీ పరిధిలోని డి.కొత్తగూడెం గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, భద్రాచలం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావ్ ఆర్థిక సాయంతో బాధిత కుటుంబాలకు అందజేసిన నిత్యావసర సరుకులు వంట సామగ్రిని నాయకులు శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, ఎంపీటీసీలు సోడి తిరుపతి రావు, మడకం . రామారావు, మద్ది వనజ, రైతు బంధు సమితి అధ్యక్షులు బత్తుల శోభన్ బాబు, మాజీ మండలాధ్యక్షులు పూజారి సూర్యచంద్ర రావు, మద్ది రాము, సొసైటీ డైరెక్టర్ పిసోడి వెంకటేష్, తోట రమేష్, శ్రీధర్, నూపా సీత్తయ్య, కొమ్ము రంజిత్, అర్జున్, కొండబాబు, నరేంద్ర, కారం పూణేశ్వరావు, శ్రీనివాస్ చారీ తదితరులు పాల్గొన్నారు.

కట్నం వేధింపులపై కేసు

భద్రాచలంఅర్బన్: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న వ్యక్తిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని పాతమార్కెట్ కి చెందిన ప్రసాద్, శిరీషలకు 7 నెలల క్రితం పెళ్లి అయ్యింది. కొన్ని రోజులుగా ప్రసాద్ కట్నం కోసం భార్యను వేధింపుకులకు గురిచేస్తుండడంతో, శిరీష స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహితను వేధించిన వ్యక్తిపై..

దమ్మపేట: వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని నాచారం గ్రామానికి చెందిన దేరంగుల లక్ష్మిని, అదే గ్రామానికి చెందిన వల్లెపు మనోజ్ అనే వ్యక్తి, గత కొద్దిరోజులుగా వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ క్రమంలో మార్చి 31న ఆ వివాహిత కిరాణ షాపునకు వెళ్లి, తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో వేధింపులకు గురిచేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

భార్యను వేధిస్తున్న వ్యక్తిపై..

భార్యను వేధింపులకు గురిచేస్తున్న భర్తపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం... దమ్మపేట గ్రామానికి చెందిన మాటేటి దివ్యను ఆమె భర్త సంతోష్‌కుమార్ భార్యపై అనుమానంతో వేధింపులకు పాల్పడుతున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు.

వృద్ధురాలిపై దాడి

దమ్మపేట: ఇళ్ల మధ్య దారిపై జరిగిన ఘర్షణలో వృద్ధురాలిపై భౌతిక దాడికి పాల్పడిన ఘటన మండల పరిధిలోని శ్రీరామపురం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల విరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నల్లమోతు ప్రసాద్, వెంపటి భార్గవ్ ఇళ్ల మధ్యన వున్న దారి హద్దుల విషయంలో ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ప్రసాద్ అత్త నున్నా చిట్టెమ్మపై వెంపటి భార్గవ్, వెంపటి చెన్నారావు నుగాయపరిచారు. ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

భద్రాద్రికి ద్రోహం చేసిన ప్రధాని


భద్రాచలంఅర్బన్: నిరసనలో నాయకులు


బూర్గంపాడులో..

భద్రాచలంఅర్బన్: రాష్ట్ర విభజన హామీలు అమలు చేయని నరేంద్ర మోదీ, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు దారాధత్తం చేస్తూ, భద్రాచలం నియోజకవర్గానికి ద్రోహం చేసిన మోదీ రాష్ట్ర పర్యటనకు అనర్హుడని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు విమర్శించారు. నరేంద్ర మోడీ రాష్ట్ర పర్యటనను నిరసిస్తూ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్లో ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గద్దం స్వామి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ... పోలవరం ప్రాజెక్ట్‌తో భద్రాచలానికి ముప్పు రాకుండా కేంద్రం రక్షణ చర్యలు చేపట్టాలని, విలీన పంచాయతీలను అయినా తిరిగి ఇప్పించాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి.నర్సారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు సరియం కోటేశ్వరరావు, సున్నం గంగా, కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటరామారావు, సంతోష్ కుమార్, పట్టణ కమిటీ సభ్యులు జ్యోతి, ఎస్.నాగరాజు, లక్ష్మణ్, శ్రీనివాస్, ఎస్. భూపేంద్ర, ఎంవీఎస్ నారాయణ, సతీష్, జోగారావు పాల్గొన్నారు.

బూర్గంపాడు: ప్రధాని మోదీ తెలంగాణ రాష్ట్ర పర్యటనను నిరసిస్తు వామపక్షాల ఆధ్వర్యంలో శనివారం బూర్గంపాడు ప్రధానకూడలిలో ఆందోళన చేపట్టారు. అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్షాల నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పేరాల శ్రీనివాస్, ముమ్వా వెంకటేశ్వరరావు, రజియా బేగం, బత్తుల వెంకటేశ్వర్లు, బర్ల తిరుపతయ్య, జహీర్, బాలకృష్ణ, సాజిద్, భీమా తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



ప్రమాదకరంగా కల్వర్టులు



మండలపరిధిలోని మొండికుంట నుండి అశ్వాపురం వరకు మణుగూరు-కొత్తగూడెం ప్రధాన రహదారి వెంబడి పలు చోట్ల కల్వర్టులు ప్రమాదకరంగా ఉన్నాయి. మొండికుంట, బీజీ కొత్తూరు, సీతరాంపురం, గొల్లగూడెం గ్రామాల్లో ప్రధాన వెంబడి కల్వర్టులు వద్ద రక్షణ గోడలు లేక తరచూ ప్రమాదాలు జరిగి ఎందరో గాయాలపాలవుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న కల్వర్టుల వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేవు. దీంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న కల్వర్టుల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న కల్వర్టుల వద్ద హెచ్చరిక బోర్డులు అయినా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- అశ్వాపురం

ప్రశ్నించాల్సిన అధికారి : రాంబాబు, ఆర్‌అండ్‌బీ ఏఈ
సెల్ నంబర్ : 9441435367